క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను బుధవారం వేలం వేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసులు తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు ఈ వేలం పాట ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు 10 గంటలలోపు స్టేషన్‌కు వచ్చి దరఖాస్తులను పూర్తి చేసి వేలం పాటలో పాల్గొనాలన్నారు. కాగా స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చిన్నగోల్కొండ సొసైటీ సర్వసభ్య సమావేశం



శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ ప్రాథమిక రైతు సేవా కేంద్రం సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సొసైటీ పరిధిలో 21 మంది రైతులకు రూ.13.78లక్షల పంట రుణాలను మంజూరు చేయడంతో పాటు 61 మందికి కొత్తగా సొసైటీ సభ్యత్వం కల్పించారు. అదేవిధంగా పలు అంశాలపై సమావేశంలో తీర్మాణం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బి.దానాకర్‌గౌడ్, డైరెక్టర్లు ప్రశాంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, బాల్యానాయక్, రూప, విజయలక్ష్మి, సీతఊట యాదయ్య, సిబ్బంది సురేష్, మధుమతి, జగపతిబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ కోర్సులు

శంషాబాద్: పట్టణంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం(సెట్విన్)లో త్వరలో మరో బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాలపరిమితి గల శిక్షణ తరగతుల్లో బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, ఎంఎస్ఆఫీస్, సీసీ కెమెరాల రిపేరింగ్ కోర్సులు ఉన్నాయని, ఔత్సాహికులు సెల్: 9440946083 నంబరులో సంప్రదించాలన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు వార్డుల వారీగా ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం, కోఆప్షన్ సభ్యుడు జె.సిద్దప్ప, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన డి.సీతారాం, ప్రధాన కార్యదర్శిగా ఆరోసారి ఎన్నికైన వి.అంజనేయులును వారు సన్మానించారు.

సుల్తాన్‌పల్లి అభివృద్ధికి నిధులు మంజూరు



శంషాబాద్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పల్లి పంచాయతీ అభివృద్ధి కోసం రూ.30లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ దండు ఇస్తారి తెలిపారు. ఈ మేరకు నిధుల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మంగళవారం సర్పంచ్‌కు అందజేశారు. సుల్తాన్‌పల్లిలో రూ.20లక్షలతో బీసీ కమ్యూనిటీ భవనం, రూ.5లక్షలతో మురుగు కాల్వ పనులు, రూ.5 లక్షలతో కేబీ దొడ్డిలో సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. నిధులు మంజూరుపై ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'మనూ-సూడాన్' ఒప్పందం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంతో సూడాన్ వైట్‌నైల్ యూనివర్సిటీ మధ్య మంగళవారం ఒప్పందం కుదిరింది. పరస్పర ప్రయోజనకరమైన విద్య, పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, ప్రోత్సహించడానికి కుదుర్చుకున్న ఈ ఒప్పందం అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఉమ్మడి పర్యవేక్షణ, జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్టులు, కాన్ఫరెన్స్‌లు, ఉమ్మడి అధ్యయన కోర్సులను ప్రోత్సహించడం, బోధన, పరిశోధన కార్యకలాపాలకు సంబంధించిన అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడికి రెండు విశ్వవిద్యాలయాలు అంగీకరించాయి.

అనుమతులు లేకున్నా.. అక్రమ నిర్మాణాల జోరు

111 జీఓ కిందకు వచ్చే గొలిదొడ్డి గ్రామ ప్రాంతంలో యథేచ్ఛగా నిర్మాణాలు

- సెట్‌బ్యాక్‌లు వదలకుండా 8 అంతస్తుల్లో భవనాల నిర్మాణం
- రోడ్లపై వేస్తున్న బోర్లు
- పట్టించుకోని అధికారులు



వంద గజాల్లో ఆరంతస్తులు నిర్మిస్తున్న భవనం



గొలిదొడ్డిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

మణికొండ: అది జీఓ 111 పరిధిలోని భూమి. అక్కడ ఎలాంటి అనుమతులు ఉండవు. అయినా ఏకంగా 8 అంతస్తుల్లో భవనాలను యథేచ్ఛగా నిర్మాణం చేస్తున్నారు. వాటి బోర్లు ఎండిపోవడంతో ఏకంగా రోడ్లపైనే బోర్లు వేస్తున్నారు. ఇరుకైన రోడ్లు, అన్నీ హాస్టళ్లే ఉండటంతో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వందల మంది ప్రాణాలు పోతాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... గతంలో వట్టినాగులపల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న గొలిదొడ్డి సగ భాగం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉండగా.. మిగిలిన భాగం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ఈ ప్రాంతం మొత్తం 111 జీఓ పరిధిలోకి వస్తుంది. దీంతో అక్కడ కట్టడాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వరు. అయినా కొందరు కబ్జాదారులు అసలు అనుమతులకు దరఖాస్తులే చేయకుండా ఏకంగా 6 నుంచి 8 అంతస్తుల మేర భవనాలను నిర్మిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేంత వరకు మిన్నకుంటున్న మున్సిపల్ అధికారులు తరువాత వాటి నుంచి ఇంటి పన్నులను మాత్రం వసూలు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదం జరిగితే...

గొలిదొడ్డి మున్సిపల్ వార్డు ఐటీ జోన్‌కు పక్కనే ఉండటంతో అనేక హాస్టళ్లు వెలుస్తున్నాయి. వాటిలో ఎన్ని అంతస్తులు, ఎన్ని గదులు ఉంటే అంత ఎక్కువగా అద్దె డబ్బులు వస్తాయనే ఆశతో పోటాపోటీగా అంతస్తులను పెంచి నిర్మాణాలు చేస్తున్నారు. ఇరుకు రోడ్లలో వస్తున్న అలాంటి భవనాల్లో అగ్నిప్రమాదం జరిగిందంటే వందల మంది ప్రాణాలు గాలిలో కలుస్తాయని పలువురు వాపోతున్నారు. ఎలాంటి సెట్ బ్యాక్‌లు లేకుండా అరకొరగా ఉన్న రోడ్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, అక్కడితో ఆగకుండా వాటిలో బోర్లు ఎండిపోతున్నా ఏకంగా రోడ్లపై బోర్లు వేసి మరింత ఇరుకు చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

గొలిదొడ్డిలో నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. అక్కడ వచ్చేవన్నీ అక్రమ నిర్మాణాలే. వాటిని కొనుగోలు చేసే వారు ఎప్పటికైనా నష్టపోతారు. వెలుస్తున్న నిర్మాణాలను మున్సిపాలిటీ, హెచ్ఎండీఏ ప్రత్యేక బృందాలు కూల్చివేశాయి. అయినా అక్రమ నిర్మాణాలు ఆగటం లేదు. వాటిపై మరోమారు త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– వి.సత్యబాబు, కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

అంతా అమ్యామ్యాల మయం...

గొలిదొడ్డిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు నార్సింగి మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులే అండగా నిలుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తమ ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అవేమీ పట్టించుకోకుండా అందిన కాడికి దండుకుని మిన్నకుంటున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన కౌన్సిలర్లు వారికి అండగా నిలిచి వారి నుంచి కోట్లలో ముడుపులు తీసుకుని వాటిని ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటిపై చర్యలు తీసుకునేందుకు వెళ్లిన అధికారులనే అడ్డుకున్నారంటే వారి లాలూచీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని వారు పేర్కొంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాలిటీకి ఎలాంటి అనుమతుల రుసుములు చెల్లించకుండా వస్తున్న నిర్మాణాలను అడ్డుకోవాలని గొలిదొడ్డి వాసులు డిమాండ్ చేస్తున్నారు.





వట్టినాగులపల్లిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పబ్, బోర్లు ఎండిపోవడంతో ఇరుకు రోడ్లపై బోర్లు వేస్తున్న భవనాల యజమానులు

క్రైం కార్నర్..

హిమాయత్‌సాగర్‌లో దూకి వ్యక్తి మృతి



ప్రమోద్ మృతదేహం

రాజేంద్రనగర్: వాకింగ్‌కు అని వెళ్లిన ఓ వ్యక్తి హిమాయత్‌సాగర్‌లో శవమై తేలిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖలీల్ వివరాల ప్రకారం.. కార్వాన్‌కు చెందిన ప్రమోద్(39) ప్రైవేటు ఉద్యోగి. ఇతడికి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇతడికి ఇద్దరు సంతానం. భార్యపై అనుమానంతో గతంలో గొడవలకు దిగాడు. భార్య ప్రైవేటు ఉద్యోగం చేస్తుండటంతో మాన్పించి ఇంటి వద్దే ఉంచాడు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో ప్రమోద్ ఇంట్లో ఆత్మహత్యకు యత్నించాడు. ఈ నెల 12వ తేదీన ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. మంగళవారం ఉదయం హిమాయత్‌సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలిందని సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి ప్రమోద్ వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నాం



బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ వెల్లడించారు. 1వ డివిజన్‌లో రూ.27 లక్షలతో నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్, వినయ్, రాజేష్, కిరణ్, ప్రశాంత్‌రెడ్డి, మధన్‌రెడ్డి, శివప్రవీణ్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా సీఎం సహాయనిధి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిన్న ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, ఇందుకోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రెబ్బ సదానంద్, గొడెల శ్యామ్ తదితరులు ఉన్నారు.

హిమాయత్‌సాగర్‌కు చెందిన జ్యోతికి...

బండ్లగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్‌సాగర్ గ్రామానికి చెందిన మైలారం జ్యోతికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో చేగూరి రాజు, శ్రీరాములు, రవీందర్, కుమార్, మైలారం మల్లేష్ పాల్గొన్నారు.



హైదర్‌గూడ ప్రాంత లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ అనారోగ్య బాధితులను ఆదుకుంటోందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కొత్వాల్‌గూడ, ఊటిపల్లి, తొండుపల్లి, అహ్మద్‌నగర్, మెహిదిగార్డెన్, వీకర్ సెక్షన్, ఇందిరారెడ్డి కాలనీలకు చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.8.90 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, అమృత, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, తాజ్‌బాబా, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



జ్యోతికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శంషాబాద్‌లో చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

'అక్రమ నిర్బంధం దారుణం'



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు

రాజేంద్రనగర్: అభివృద్ధిపై చర్చిద్దామని వెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా నిర్బంధం చేయడం దారుణమని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, బీజేపీ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ యువ మోర్చా నాయకులు అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులను ప్రశ్నిస్తున్నారన్నారు.

ఎక్కడ అభివృద్ధి జరగడం లేదని కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు లెక్కలతో సహా వివరిస్తున్నారన్నారు. ఇదే విషయమై బీఆర్ఎస్ పార్టీ నాయకులు బహిరంగ చర్చ కోసం ఆహ్వానించగా చర్చకు తాను వెళ్తుండగా పోలీసులు గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. బహిరంగ చర్చ జరిగితే బీఆర్ఎస్ ఎనిమిదేళ్ల నిరంకుశ పాలన ప్రజల ముందు బట్టబయలు అవుతుందని గ్రహించి ఇలా నిర్బంధం విధిస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాగుతుందన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గెలుపొందిన మహిళలతో ప్రాజెక్టు అధికారిణి రాధారాణి

రాజేంద్రనగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జోనల్ స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో రాజేంద్రనగర్ సర్కిల్ మహిళలు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాజెక్టు అధికారిణి రాధారాణి తెలిపారు. ఇండోర్, ఔట్‌డోర్లలో లక్ష్మి, మాధవి, ఐషా, హేమలత, అనూషలు గెలుపొందారన్నారు. ఇందులో లక్ష్మి మూడు బహుమతులను గెలుచుకుందని వెల్లడించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.

అధికారులతో కమిషనర్ సమావేశం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్‌సాగర్‌లోని కార్యాలయంలో మంగళవారం కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేసి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే కార్పొరేషన్ పరిధిలోని హోటళ్లలో ఆహార భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి తనిఖీలు చేయాలన్నారు. ప్రమాణాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహిస్తాం



జెడ్సీ అశోక్‌సామ్రాట్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

రాజేంద్రనగర్: మహనీయుల జయంతి ఉత్సవాలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పలుగుచెరువు మహేష్ తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచనల మేరకు సిఫారస్సు పత్రాన్ని మంగళవారం జోనల్ కమిషనర్ అశోక్‌సామ్రాట్‌కు వారు అందజేశారు. ఈ సందర్భంగా పలుగుచెరువు మహేష్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోనే రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, మేధావులను ఆహ్వానిస్తున్నామని, ఉత్సవాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరామన్నారు.

నిధుల మంజూరుకు తగిన ఏర్పాట్లు అంచనాలతో పాటు టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ జగన్‌తో పాటు కార్యనిర్వాహక ఇంజినీర్ నరేందర్‌గౌడ్‌కు ఆదేశాలను జారీ చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి బట్టు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు పోయిల జీవన్‌దాస్, అనుముల జాన్‌పాల్, పచ్చ శ్రీనివాస్, కోశాధికారి మంగళారం శ్రీనివాస్, ఉప కోశాధికారి ఎడ్లకాడి సూర్యం, ఉపాధ్యక్షులు నత్తి ధనుంజయ్, దాసరి రమేష్, జోగి శ్రీనివాస్, మాధవులు, జాయింట్ సెక్రెటరీ ఆదిరాల రవికుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కారు కింద పడి చిన్నారి మృతి

గచ్చిబౌలి: కారు వెనుక చక్రాల కింద పడి ఓ చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దంపతులు రాకేష్‌యాదవ్– లక్ష్మీ యాదవ్ బతుకుదెరువుకు వలస వచ్చి రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా చిన్నారి భూమి(3)ని తీసుకొని పెద్దనాన్న తిలక్ ఆదివారం రాత్రి 7.15 గంటలకు రాఘవేంద్ర కాలనీలో మార్కెట్‌కు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న తిలక్ తూలి చిన్నారి మీద పడటంతో అటుగా వస్తున్న కారు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే భూమి మృతి చెందింది. సీసీ ఫుటేజీ ఆధారంగా కారును గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడి

ఎన్‌సీసీ నాగార్జునలో ఘటన

గచ్చిబౌలి: ఓ స్విగ్గీ డెలివరీ బాయ్‌పై సెక్యూరిటీ గార్డులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 8.58 గంటల సమయంలో స్విగ్గీ డెలివరీ బాయ్ శాంతకుమార్ గచ్చిబౌలిలోని ఎన్‌సీసీ నాగార్జున రెసిడెన్సీ గేటెడ్ కమ్యూనిటీలో ఫుడ్ డెలివరీకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డులు ఆపి నువ్వు ఏ లిఫ్ట్‌లో వెళ్లావని అడగ్గా, స్విగ్గీ బాయ్ సర్వీస్ లిఫ్ట్‌లో వెళ్లానని చెప్పగా, లేదు నువ్వు మెయిన్ లిఫ్ట్‌లో వెళ్లావంటూ గొడవకు దిగారు. ఆరుగురు సెక్యూరిటీ గార్డులు దాడి చేయగా, గాయపడిన శాంతకుమార్ అక్కడి నుంచి తప్పించుకొని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన ముగ్గురు సెక్యూరిటీ గార్డులను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు.

సామాజిక సేవలో 'మేన దివ్య'కు నేషనల్ అవార్డు



రాజేంద్రనగర్: నిరుపేదలు, అన్నార్థులను చూసి చలించిపోయి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి అనతి కాలంలోనే మహిళా లోకంలో సంచలనం సృష్టించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మేన దివ్యకు మంచి గౌరవం దక్కింది. శరణ్య డెవలప్‌మెంట్ ఫౌండేషన్ స్థాపించిన కీలక పాత్ర వహించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆమె చేసిన సేవలను గుర్తించిన బిజినెస్ మింట్ సంస్థ మహిళా దినోత్సవం సందర్భంగా మేన దివ్యకు ప్రతిష్టాత్మకమైన నేషనల్ వైడ్ ఉమెన్ ఎక్సలెన్స్ అవార్డు–2023 ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాతల సాయంతో మున్ముందు కూడా మరెన్నో సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సహకరించిన, సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పూసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా దినోత్సవ ముగింపులో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కార్మికులు

మణికొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని, ఇప్పటికే రాణిస్తున్న వారిని మార్గదర్శకంగా తీసుకుని ఎదగాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి అన్నారు.

గత వారం రోజులుగా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన మహిళా దినోత్సవ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. గతంలో కన్నా మహిళలు రాణించేందుకు అన్ని రంగాల్లో అవకాశాలు విరివిగా ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారం రోజులుగా మున్సిపల్ మహిళా కార్మికులు, కౌన్సిలర్లకు నిర్వహించిన పలు పోటీల్లో రాణించిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.అరుణజ్యోతి, ఉషారాణి, బి.యాదమ్మ, నాగపూర్ణ శ్రీనివాస్, సునీతగణేష్ తదితరులు పాల్గొన్నారు.